# ఋణానుబంధం

మూడ్రోజుల సెలవు మంజూరు చేయించుకునే సరికి ముత్తాతలు దిగొచ్చారు. ములకనూరు బస్సులో మూడు సీట్లు సంపాదించడం అంతకంటే కష్టమైపోయింది. పద్మవ్యూహంలో అభిమన్యుడిలా బస్సులో దూరి వీరవిహారం చేస్తే అమ్మకో చోట, నాన్నకో చోట నాకో చోట సీట్లు సంపాదించగల్గినందుకు నన్ను నేనే అభినందించుకున్నాను. తెలివి తేటలన్నీ సంపూర్ణంగా ప్రయోగించి, పక్క సీటు పాసింజెర్లకు నచ్చజెప్పి అడ్జస్ట్‌మెంట్స్ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేశాను. ముగ్గురం ఒకే సీట్లో కూచున్నాం.

ఎక్స్‌ప్రెస్ స్పీడందుకుంది.

"చూశారా! నా మనవడీ లోకంలో కొచ్చి నెల్రోజులన్నా కాలేదు. అప్పుడే మనిద్దర్నీ పిలిపించుకుంటున్నాడు." అంది అమ్మ నాన్నతో - తానో సామ్రాజ్యానికి రాజమాతైపోయినట్టు.

"మరి అప్పుడో! .. నా మనవరాలు పుట్టినప్పుడు అంతే గదా! అదీ నా మనవరాలు." నాన్న కుడి చెయ్యి మీసం మీది కెళ్లింది.

ఐదేళ్ల క్రితం కళ్లు తెరిచిన నా కూతుర్ని నా మనవరాలంటాడు నాన్న. ప్రతిగా మా అమ్మ ఇప్పుడు నా ఇరవై రోజుల కొడుకును నా మనవడంటూ పొంగిపోతుంది.

"నా మనవడేం జేస్తున్నాడో!" గొణిగింది అమ్మా.

"నా మనవరాలు తమ్ముడితో ఆడుకుంటుందేమో" నాన్న ప్రతిస్పందన.

అమ్మా, నాన్నలు కబుర్లలో పడిపోయారు.

తొలి సంతానం కూతురైనా జీవితంలో కొత్త వసంతం ప్రవేశించిన అనుభూతినిచ్చింది. అందుకే పాపకు "ఆమని" పేరు పెట్టాం. మలి సంతానం కొడుకని శైలజ నుండి టెలిగ్రాం రాగానే నరాల్లో గంగానది ప్రవహించింది. ఏడేళ్ల క్రితం - నడిచే ముద్ద మందారంలా నాతో ఏడడుగులు నడిచిన శైలజ ఇప్పుడు ఇద్దరు పిల్లలకు తల్లి. సృష్టి ఎంత విచిత్రమైందో!

"ఇహ మనం మన పిల్లల భవిష్యత్తు కొరకు బాగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలండీ" రెండో కాన్పుకు పుట్టింటికెల్తూ శైలజ అన్న మాటలు గుర్తుకొచ్చి నా పెదాల మీద చిరునవ్వు మెరిసింది.

"ఏందయ్యో, నీది నువ్వే నవ్వుకుంటున్నావ్!" నా పక్కనే నిల్చున్న పెద్దమనిషి మాట అచ్చం రామనాథం గొంతులోంచే వచ్చినట్టనిపించింది. కాని మనిషలా లేడు.

"ఏం లేదండీ" అనూరుకున్నా.

కెమెరా ఫ్లాషలా-

రామనాథం మదిలో మెదిలాడు. మనసొకేసారి అటువైపెళ్లింది. కాలం వెనక్కు తిరిగింది.

రామనాథం లక్షల్లో ఒకడు. ట్రాన్స్‌ఫరై సిద్దిపేటకెళ్లానప్పుడు. సిద్ధిపేట పట్టణం పాతదైనా నాకుకొత్త. కోలీగ్స్ సహకారంతో మెయిన్ రోడ్డులో ఇల్లు దొరగ్గానే శత్రువ్యూహాలను దెబ్బదీసి అఖండ విజయం సాధించిన విక్రమార్కుడిలా ఫీలయ్యాను. ఇలా ఉత్తరం రాయగానే అలా వచ్చి వాలింది శైలజ అమనితో. ఇల్లు బావుందని ప్రశంసల వర్షం కురిపించింది. వంటగదీ, పడగ్గదీ, హాలూ, పెరడూ, ఇంటి చుట్టూ ప్రహరీ గోడా, బయట గేటూ. మా టేస్టుకు సరిపోయేలాగుంది.

మానసవీణ మోహన రాగం మీటింది. మళ్లీ పెళ్లి కూతురులా కనిపించిన శైలజ చెంపలందుకోబోయాను. చారెడేసి కళ్లల్లో నానీడ చూడబోయాను.

"బాబూ...!" లోతు బావిలోంచి వచ్చినట్టుందా హీనస్వరం. గేటు వద్ద ఓ ముసలాయన. మోకాలు పైకి ధోతీ, చేతుల్లేని బనీనూ, నెత్తికి గళ్ల రూమాలు... అన్నింటికీ చిరుగులు. పెరిగిన గడ్డం మొహాన్ని చిన్నదిగా మార్చేసింది. ప్రాణాలు కళ్లల్లో ఉన్నట్టున్నాయి.

"ఎవరూ, ఏంగావాలి!" గుర్రుమంది శైలజ.

జవాబియ్యలేదతడు.

"మాట్లాడవేమయ్యా?"

"నాపే... నాపేరు రామనాథమమ్మా" అవసరానికంటే ఎక్కువ మాగిన మామిడి పండులా ముడతలు పడిన మొహాన్ని రుమాలుతో నిమురుకున్నాడు.

"ఐతే ఏందటా?" అతనికి దగ్గరగా వెళ్లాం.

"ఏం లేదు బాబూ!" చేతులు జోడించాడు.

"మరెందుకొచ్చావిక్కడికీ?" అమని జడుసుకుంటుందేమోనని నా భయం.

నా అంచనా తారుమారైంది. అమని కేరింతలు కొడుతూ తల్లి ఒడిలోంచి జారుతుంది అతని వైపు చేతులందిస్తుంది.

"నా ఆయుష్షు గూడా పోసుకుని సల్లగా బతుకు తల్లీ!" దీవెనలందించాడు.

"ఇంతకీ నీకేం గావాలీ?" అడిగాను.

"పని గావాలె బాబూ!"

"పనా..... నీకా... ఎముకల గూడులా గున్నావు..." రాబోయే నవ్వును ఆశ్చర్యం అదిమి పట్టింది.

"రెండ్రోజుల నుంచి కడుపులకేమీ లేదయ్యా! ఏదన్నా పంజేయించుకుని గిన్ని గంజినీళ్లు పొయ్యండ్రి." మాటలు కష్టంగా వస్తున్నాయి.

"పాపం! ఓ ముద్ద అన్నం బెట్టు శైలూ!" పురమాయించింది నా జాలి గుండె.

నన్నో పక్కకు లాక్కెళ్లి

"వీడెవడోనండీ. మనకిది కొత్త ఊరాయె." తటపటాయించింది శైలజ.

"అబ్బా... నీకన్నా అనుమానాలే. పాపం ముసలాయన. ఓ ముద్ద వేసి పంపించూ! ఆ తర్వాత మనం భోంచేసి సామాన్లు సర్దేసుకుందాం."

రామనాథం వినుంటాడు.

"పంజేసినంకనే అన్నం బెట్టమ్మా"

"పంజెప్పకపోతే అన్నం తీసుకోవా?" శైలజ.

"దండం బెడతానమ్మా. తిన్నంక పంజెయ్యలేను. మీ ఋణంలో పడిపోతాను."

"పాపం! అభిమానం గల మనిషిలాగున్నాడు శైలూ!"

"మీ కందరు అలాగే కనబడ్తారు మహానుభావా!" అంటూ లోపలికెళ్లింది.

గంటలో ప్రహరీగోడ చుట్టూ గుంతలు తవ్వి పూల చెట్ల విత్తనాలు నాటాడు. గుంతలు పూడ్చి నీళ్లు చల్లాడు.

ఆయాసంతో రొప్పుతూ కూచున్నాడు వరండాలో. అక్కడే తిని ఒరిగాడు. మా పనిలో మేమున్నాం లోపల. ఆమని అంబాడుతూ ఎప్పుడు వెళ్లిందో వరండాలోకి.

"త్యాతా... త్యాతా...!" కేరింతలు కొడుతూంది. సామాన్లు సర్దడమాపి వెళ్లి చూద్దుము గదా- ఆమని రామనాథం ఒడిలో ఆడుకుంటుంది. అతడు గూడా నవ్వుతూ ఆడిస్తున్నాడు.

"ఇంతకీ నువ్వెవరు తాతా?" అడిగా.

రామనాథం ముఖకవళికలు మారాయి.

"నేనో నేతగాణ్ని బాబూ! అందరూ పోగా మొగుడొదిలేసిన కూతురూ నేనూ మిగిలినం. అది గూడా నెల్రోజుల కింద రైలు పట్టాల మీద తలకాయ పెట్టి తన దారి తాను చూస్కుంది. ఒంటిగాణ్నైపోయాను. ఇల్లు అప్పుల కిందికి పోయింది. నేను బజార్ల పడ్డ." రుమాలుతో కళ్లద్దుకున్నాడు. ఆమని ఆ రుమాలు పట్టుకు లాగింది. పాపను తీసుకోబోయింది శైలజ.

"ఉండనీయమ్మా!" అన్నాడు. పాప గూడా రానంది.

"మరేం చేద్దామనుకుంటున్నావు?" అడిగా.

ఎడం చేత్తో పాపను హత్తుకుని కుడిచేత్తో పైకి చూపించి "ఆ దేవుడేది చెయ్‌మంటే అది చేస్తా." అన్నాడు. నా బుర్రలో ఆలోచనొకటి తళుక్కుమంది. శైలజనింట్లోకి తీసికెళ్లి.

"మనకెలాగూ ఓ పనిమనిషి కావాలి గదా ఇతణ్నే ఉండుమందామా!" సలహా అడిగా. ఎంతైనా కరణేషు మంత్రి గదా.

"ఇదంతా దొంగాటకమేమో నండీ!"

ఏమో చెప్పలేం. ఈ రోజుల్లో సిన్మాల పుణ్యమాని దొంగతనాలు, ఆధునీకరించబడ్డాయి గూడాను. ఎందుకో నాకతని మీదో నమ్మకం ఏర్పడుతూంది.

"అతడలా గన్పించడం లేదు శైలూ!"

తిమ్మిని బమ్మి చేయగల క్రిమినల్ లాయర్ వాదనకు విధిలేక తలూపిన న్యాయమూర్తిలా నా వాదన కెదురు చెప్పలేదు శైలజ. అతడూ అంగీకరించాడు. జీతం ప్రసక్తి రాలేదు.

రామనాథం మూణ్రోజుల్లో ఇంటిమనిషై పోయాడు. పొద్దున్నే పాదులకు నీరు పెట్టడం, బజారు కెళ్లి ఏది తెమ్మంటే అది తెచ్చి ఐదు పైసల్తో సమా చిల్లర డబ్బులు తిరిగివ్వడం, మా గుడ్డలుతకడం అతని నిత్యకృత్యాల్లో భాగమైనాయి. వేళకింత తింటున్నాడు కాబట్టి మొహమ్మీద కళ వచ్చింది. గెడ్డం గీయించుకుని మీసాలుంచుకున్నాడు.

"అవి గూడా తీయించక పోయావా?" అడిగాన్నేను.

"అవి పాప ఆడుకునేందుకుంచానయ్యా!" అన్నాడు.

ఆ జవాబు అంతరంగాన్ని తట్టింది.

వరండా అతని నివాసం. ఆమని అతణ్ని విడిచి ఉండడం లేదు కాబట్టి శైలజ కూపిరి పీల్చుకున్నట్టుంది.

రెణ్నెళ్ల తర్వాత నా అరియర్స్ రాగానే జీతమెంతివ్వాలని అడిగా.

"తిండి మీరే పెడ్తున్నారు. బట్టలిప్పిస్తిరి. ఇంక జీతమెందుకయ్యా?"

"అట్లంటే నేనొప్పుకోను తాతా. జీతం తీసుకోకుంటే మేం పని చేయించుకోం" ఖచ్చితంగా చెప్పేసింది శైలజ.

రెణ్నెళ్ల జీతం చేతికివ్వగానే రామనాథం కోట్ల రూపాయలు సంపాదించిన సన్నకారు కాంట్రాక్టర్‌లా పొంగిపోయాడు. బొడ్లోంచి ఓ కాయితం తీసి నా చేతులుంచి

"ఇది నా మనవని పత్తా బాబూ. ఆ పైసలు వానికి పంపించుండ్రి" అని డబ్బులు తిరిగిచ్చేశాడు.

"మనవడంటే...?!" నా భృకుటి ముడిపడింది.

"చచ్చిన నా కూతురు కొడుకు. వాళ్ల నాయనమ్మ దగ్గరుంటున్నడు."

నెలనెలా రామనాథం జీతం అతని మనవనికి మనియార్డర్ ద్వారా వెళ్లేది. ఎన్ని రోజులు కాంపు కెళ్లినా నాకు నిశ్చింతగా ఉండేది.

రెండేళ్లు గడిచాయలా.

అంతకు ముందు రోజు కాంపు నుండి తిరిగొచ్చే సరికి చాలా రాత్రైంది. ఆలస్యంగా నిద్రబోయాను. ఉదయమే.

"ఆఫీసుకు టైమైపోతుంది లేవండీ!" శైలజ దుప్పటిలాగి టూత్‌బ్రష్ చేతికివ్వబోయింది. గోడ గడియారం ఎనిమిదని గుర్తు చేసింది. రామనాథం మార్కెట్ కెళ్లాడట కూరగాయలకు.

అప్పుడే తలంటు స్నానం చేసినట్టుంది శైలజ. విరబోసుకున్న కురులు ఫాన్ గాలికి అలవోకగా గంతులేస్తున్నాయి. సోయగాన్నంత సొంతం జేసుకున్న చెక్కిళ్ల మీద పున్నమి వెన్నెలలో అరవిరిసిన పారిజాతంలాగున్న శైలజ అందాల్ని కళ్లతో జుర్రుకుంటున్నాను.

"అబ్బా... ఏమిటా చేష్టలూ!" ఆవిడ మొహం ఎర్ర చామంతిలా విచ్చుకుంది. కనురెప్పలు వాల్చి కొంటెగా చూచింది. చెయ్యందుకున్నాను. చెట్టు మీంచి రాలిన పూవులా నా ఒళ్లో వాలిపోయింది.

"అమ్మా!" దిక్కుల్ని చీల్చుకుంటూ రామనాథం గొంతు బిగ్గరగా వినిపించింది. గబగబా బయటికొచ్చాం.

రోడ్డు మీద మనిషిని లారీ గుద్దేసింది. రక్తం మడుగులో రామనాథం కొట్టుకుంటున్నాడు. తల నుండి మొండెం వేరైంది. కూరగాయలు చెల్లాచెదరై పడున్నాయి. రక్తంతో తడిసిన ఆలుగడ్డలు నెత్తురు బంతుల్లాగున్నాయి. రోడ్డు ప్రక్కన ఆమని బిత్తర చూపులు చూస్తుంది. గౌను మట్టి గొట్టుకు పోయింది.

"రామనాథం తాతా!" శైలజ కళ్లు ధారాపాతలైనాయి. నా గుండె జారి బండ మీద పడినట్లైంది.

"ఈ ముసలాయన మీవేడా?" అడిగాడు లారీ డ్రైవర్ - కంగారుగా.

ఔనని తలూపాను.

"గీ పిల్లను రక్షించి ముసలోడు చచ్చిండు. పొద్దుగాల్ల లేచి ఎవల మొకం జూసిన్నో.. డేంజరైపాయె. గాముసలోడు చావకపోతే గీ పిల్ల చచ్చిపోయేది - నా లారీ కింద పడి."

"అసలెట్లా జరిగిందయ్యా!" అడిగాడొకాయన.

"రోడ్డు మీద జనం లేరని స్పీడుగా తీసుకొస్తున్నా" నెత్తికి చేతులానించి కూచుండిపోయాడు డ్రైవర్. "ఎట్నుంచి వచ్చిందో గా పిల్ల అచానక్ రోడ్డు మీది కొచ్చింది. నాకు గుండాగినంత పనైంది. పరేశాన్‌తోని బ్రేకుమీద కాలుపడేలోగా గీ ముసలాయన ఉరికొచ్చి పిల్లను పక్కకు నూకేసి తాను ముంగటి టైర్ల కిందికొచ్చిండు."

బరువెక్కిన గుండెల్తో రామనాథం మనవనికి టెలిగ్రామిచ్చా. రెస్పాన్సు రాలేదు. రామనాథం పార్థివ శరీరాన్ని చితిమంటలు కబళిస్తూంటే కళ్లల్లో నీళ్లాగలేదు. ఏ జన్మ ఋణానుబంధమో అది.

"దిగవేంరా, అదేమిటీ ఆ కళ్లల్లో నీళ్లేమిట్రా?" నా భుజం తట్టి నిలదీశాడు నాన్న. బస్సంతా ఖాళీ అయిందప్పటికే.

"ఏం లేదు నాన్నా" సూటుకేసందుకున్నా.

అత్తారింట్లో సాదర సత్కారాలైనాయి. ఆమని పరుగెత్తుకొచ్చి మా నాన్న చంకలో చేరిపోయింది.

బాబుకు నామకరణం చెయ్యాలి.

"నీ కొడుకు పేరేం పెడదామురా?" అడిగాడు నాన్న. మనసులోని మాట బయట పెడదామంటే ధైర్యం చాలడం లేదు. పట్టు బట్టల్లో మెరిసిపోతున్న శైలజ సలహా నడిగాయి నా కళ్లు.

"మామగారేమంటారో!" అంది.

"నాదేముందమ్మా. అంతా మీ ఇష్టమే! అనేశాడు నాన్న. "మీ పేరు పెడితే బావుంటుందంటారు గదూ!" అమ్మ నవ్వింది.

మా అత్తా, మామా, బామ్మర్దీ, మరదలూ కుటుంబ గాథా చిత్రం చూస్తూన్న ప్రేక్షకులైపోయారు.

"నా పేరు కాదు రామనాథం అని పెడదాం. అతని త్యాగాన్ని మనం మరవొద్దు సుమా!" అన్నాడు నాన్న గంభీరంగా.

మా మనసులోని మాట నాన్న నోట వచ్చినందుకు శైలజ మొహం విప్పారింది. నాకు తృప్తిగా ఉంది.

"తమ్ముల తాతనా!" ఆమని తన భాషలో స్పందించింది.

'రామనాథం తాత చనిపోయి తమ్ముడై పుట్టాడమ్మా!" మా అమ్మ వివరణ ఇచ్చింది.

(ఆకాశవాణి-హైదరాబాదు-సి-ప్రసారం 26-11-92)